కేపీహెచ్‌బీలో డంపింగ్ మాఫియా..!

- ఖాళీ స్థలం కనిపిస్తే బండరాళ్లు నింపేస్తారు
- అర్ధరాత్రి వేళల్లో అడ్డగోలు వ్యాపారం
- లబోదిబోమంటున్న ఖాళీ స్థలాల యజమానులు





ఖాళీస్థలాల్లో ఇష్టారాజ్యంగా బండరాళ్లను డంప్ చేసిన దృశ్యం



కేపీహెచ్‌బీకాలనీ: అడ్డగోలు వ్యాపారులకు అడ్డే లేదు అన్నట్లుగా తయారైంది కేపీహెచ్‌బీ కాలనీలోని పరిస్థితి. ఎవరైనా ఇంటి స్థలం కలిగిన వారు తమ స్థలాలను ఎలాంటి నిర్మాణం చేపట్టకుండా ఖాళీగా వదిలారంటే అర్ధరాత్రి వేళల్లో వచ్చే టిప్పర్ వాహనాలు అడ్డూ అదుపులేకుండా బండరాళ్లను డంప్ చేసి వెళ్లిపోతాయి. ఆ తరువాత ఇక అంతే సంగతులు అన్నట్లుగా బండ రాళ్లను ఆ ఖాళీస్థలంలో నుంచి తొలగించాలంటే ఆ యజమాని లక్షల్లో ఖర్చుపెట్టాల్సిన దుస్థితి. ఎవరు.. ఎందుకు తమ స్థలంలో బండరాళ్లను నింపుతున్నారో తెలియక అయోమయానికి గురికావడంతో పాటు నింపిన బండరాళ్లను బయటకు తీయించేందుకు జేబులు గుల్ల చేసుకోవాల్సి వస్తోందని స్థల యజమానులు లబోదిబోమంటున్నారు. లక్షలాది రూపాయలు ముడుపులుగా చేతులు మారుతున్న ఈ చీకటి వ్యాపారంలో ప్రభుత్వ, ప్రైవేటు వ్యక్తుల భూములతో పాటు చివరకు సామాన్య ప్రజలే సమిధలుగా మారుతున్నారంటే అతిశయోక్తి కాదు.

- కూకట్‌పల్లి హౌసింగ్‌బోర్డుకాలనీ చుట్టుపక్కల ఉన్న ఖాళీస్థలాలు అడ్డాగా నడుస్తున్న అడ్డగోలు వ్యాపారం పేరు బండరాళ్ల డంపింగ్. నగరంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో భారీ భవనాలు, బహుళ అంతస్తుల నిర్మాణం కోసం చేపట్టే సెల్లార్ తవ్వకాలలో వెలువడే బండరాళ్లను సుదూర ప్రాంతాలకు తరలించడం భారీ ఖర్చుతో కూడుకున్న వ్యవహారం.
- సెల్లార్ తవ్వకాల కాంట్రాక్టులు దక్కించుకున్న వ్యాపారులు బండరాళ్లను, మట్టిని సుదూర ప్రాంతాలకు తరలించడం సాధ్యం కాక నగరంలోని నిర్మానుష్య ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుంటున్నారు.
- ఖాళీస్థలాలు, నిర్మానుష్య స్థలాలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలకు చెందిన చోటా, మోటా నాయకులను ఎంపిక చేసుకొని బండరాళ్ల డంపింగ్‌కు చోటు చూపించి సహాయ పడితే టిప్పర్‌కు రూ. 300 నుంచి 500 వరకూ ముట్టచెపుతున్నారు.
- దీంతో చోటామోటా నాయకులు అర్ధరాత్రి వేళల్లో తమ కాలనీ చుట్టుపక్కల ప్రదేశాలు, ఖాళీస్థలాలను గుర్తించి బండరాళ్లతో డంపింగ్ చేస్తూ చీకటి వ్యాపారాన్ని సాగిస్తున్నారు.
- గత పదేళ్ల కిందట నిజాంపేట, శంషీగూడ, గాజులరామారం వంటి ప్రాంతాల్లో ఉన్న క్వారీ గుంతల్లో బండరాళ్లను నింపి సొమ్ము చేసుకున్నారు.
- క్వారీ గుంతలను నింపిన తరువాత గదులను నిర్మించి ప్రభుత్వ భూములను దర్జాగా అమ్ముకొని సొమ్ము చేసుకున్న ప్రబుద్ధులు తమ ధన దాహం తీరకపోవడంతో ప్రైవేటు వ్యక్తులకు చెందిన స్థలాలు, ఇంటి జాగలను కూడా వదలకపోవడం గమనార్హం.
- గత కొన్ని నెలలుగా కేపీహెచ్‌బీకాలనీ చుట్టుపక్కల ఉన్న ఖాళీస్థలాలను దర్జాగా బండరాళ్లతో నింపుతూ కోట్లాది రూపాయలను ఆర్జిస్తున్నారు.
- అక్కడ ఇక్కడ అనే తేడా లేకుండా రాత్రి వేళల్లో వందల సంఖ్యలో టిప్పర్‌లను రప్పిస్తూ బండరాళ్లను ఖాళీ స్థలాల్లో నింపుతున్నారు.
- ముళ్లకత్వ చెరువు, కామునిచెరువు శిఖం భూములను సైతం బండరాళ్లతో నింపిన సంగతి సర్వత్రా విస్మయానికి గురిచేసిన విషయం విదితమే.
- తాజాగా కేపీహెచ్‌బీకాలనీ 15వ ఫేజ్‌లోని నివాస స్థలాలు, హౌసింగ్‌బోర్డుకు చెందిన ఖాళీ స్థలాలను సైతం వదలకుండా అర్ధరాత్రి వేళల్లో బండరాళ్లతో నింపుతుండటం విస్తుగొలుపుతోంది.
- అర్ధరాత్రి వేళల్లో వచ్చే టిప్పర్ వాహనాలకు స్థానిక పోలీసులు కూడా పూర్తి సహకారం అందిస్తూ అందినకాడికి దండుకుంటున్నారనే విమర్శలు సైతం వినిపిస్తున్నాయి.
- సామాన్య ప్రజలు తమ స్థలాల్లో పెద్దపెద్ద బండరాళ్లను ఎవరూ చూడని సమయంలో డంపింగ్ చేసి వెళ్లడంతో ఇళ్లు నిర్మించుకునే సమయంలో లక్షలాది రూపాయలు వెచ్చించి వాటిని తిరిగి బయటకు తోలాల్సిన దుస్థితి నెలకొనడం శోచనీయం.

నిఘా పెట్టి నియంత్రిస్తాం

హౌసింగ్‌బోర్డుకు చెందిన ఖాళీస్థలాల్లో అర్ధరాత్రి వేళల్లో టిప్పర్‌లతో బండరాళ్లను నింపుతున్న విషయం మా దృష్టికి వచ్చింది. ఆదివారం అర్ధరాత్రి పట్టుకునేందుకు యత్నించడంతో పాటు పోలీసులకు కూడా ఫిర్యాదు చేశాం. బండరాళ్లను డంపింగ్ చేస్తున్న మాఫియా ఆగడాలను అడ్డుకునేందుకు గట్టి నిఘాపెట్టడంతో పాటు సెక్యూరిటీని కూడా పెంచుతాం. అవసరమైతే పోలీసులకు ఫిర్యాదు చేసి క్రిమినల్ కేసులు నమోదు చేపిస్తాం.

– కిరణ్‌బాబు

క్లుప్తంగా

రక్తదాన శిబిరం



కూకట్‌పల్లి: సిద్ధార్థ కళాశాల డిగ్రీ, పీజీ కళాశాలలు ఉమన్స్ కో ఎడ్ సంయుక్తంగా సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల చైర్మన్ గొట్టిముక్కల భాస్కరరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 112 మందికి పైగా విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి సంవత్సరం రెడ్ క్రాస్ సొసైటీ వారి అనుబంధంతో నిర్వహించి ఆపదలోఉన్న వారికి రక్తదానాన్ని అందజేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా కళాశాల డైరెక్టర్‌లు మధుసూధన్‌రావు, ఎస్.అరవింద్‌రావు, కళాశాల ప్రిన్సిపాల్స్ ఎ.పద్మప్రియ, ఎస్.చంద్రశేఖర్‌నాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన దీక్ష

కూకట్‌పల్లి: టీఎస్‌పీఎస్‌సీ పేపర్ లీక్‌కు నిరసనగా మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన దీక్ష చేపడుతున్నామని కూకట్‌పల్లి బీజేపీ సీనియర్ నాయకుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. కూకట్‌పల్లి బీజేపీ కార్యాలయం నుంచి ఉదయం 10 గంటలకు కలెక్టర్ కార్యాలయానికి బయల్దేరుతామని పేర్కొన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలోని బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని దీక్షను జయప్రదం చేయాలన్నారు.

న్యూ ఎరాలో ఫేర్‌వెల్

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ కాలనీలోని న్యూ ఎరా పాఠశాలలో విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. 9వ తరగతి విద్యార్థులు 10వ తరగతి విద్యార్థులపై పూల వర్షం కురిపిస్తూ వారందరిని వేదిక వద్దకు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా 9వ తరగతి విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నారు. 10వ తరగతి విద్యార్థుల తమ ఉపాధ్యాయులకు పూల బోకేలు ఇచ్చి సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వేణుగోపాలరెడ్డి, అకడమిక్ ఇన్‌చార్జి అపర్ణా, ఉపాధ్యాయుల, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

షటిల్ కోర్టును నాణ్యతా ప్రమాణాలతో నిర్మించాలి



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

బాలానగర్: షటల్ కోర్టును నాణ్యతా ప్రమాణాలతో త్వరగా పూర్తి చేయాలని బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి అన్నారు. సోమవారం కళ్యాణినగర్‌లో నిర్మిస్తున్న షటిల్ కోర్టు పనులను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. కాలనీవాసులు నిర్మాణ పనులను దగ్గర ఉండి చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈ రషీద్, నాయకులు ఖాజా, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

నేడు 'మనూ'లో ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమం

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో మంగళవారం ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమం నిర్వహించనున్నట్లు డాక్టర్ సయ్యద్ అస్మత్‌జహాన్ తెలిపారు. సయ్యద్ హమీద్ లైబ్రరీ ఆడిటోరియంలో జరిగే ఈ కార్యక్రమానికి ఉర్దూ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ అధ్యక్షత వహిస్తారు. ప్రముఖ ఉర్దూ, పర్షియన్ విమర్శకుడు, కెనడాకు చెందిన డాక్టర్ సయ్యద్ తకీ అబేదీ పాల్గొంటారన్నారు.

నేడు ప్రపంచ నీటి దినోత్సవం

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో ప్రపంచ నీటి దినోత్సవాన్ని (డబ్లూడబ్ల్యూడీ) పురస్కరించుకొని ప్రత్యేక కార్యక్రమాలను మంగళవారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. క్యాంపస్‌లోని ఓపెన్ ఎయిర్ థియేటర్‌లో నీటిపై డాక్యుమెంటరీ ఫిల్మ్ ప్రదర్శించడానికి కూడా ఏర్పాట్లు చేశారు. మనూ జల్‌శక్తి అభియాన్ స్కూల్ ఆఫ్ సైన్సెస్ చైర్మన్ ప్రొఫెసర్ షకీల్ ఆహ్మద్‌ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి సాయంత్రం 4.30 గంటలకు వైస్‌చాన్సలర్ ప్రొ.సయ్యద్ ఐనుల్‌హసన్ ప్రారంభిస్తారు.

ఇంటింటికీ తెలుగుదేశం పార్టీ

కేపీహెచ్‌బీకాలనీ: భగత్‌సింగ్‌నగర్‌లో సోమవారం నిర్వహించిన ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పార్టీ జాతీయ అధికార ప్రతినిధి, మల్కాజ్‌గిరి పార్లమెంట్ పరిశీలకురాలు తిరునగరి జ్యోత్స్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి తెలుగుదేశం పార్టీ చేసిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించే కరపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకురాలు ఉప్పల పద్మాచౌదరి, డివిజన్ సీనియర్ నాయకులు షేక్ సత్తార్, ఉమా, సుబ్బారావు, మధు, సుబ్బరామ శాస్త్రి, కిషోర్, రామకృష్ణ, రమాదేవి, గోపీకృష్ణ, ఆర్‌కే మొరంపూడి, కర్నాటి ఉష, శ్రీదేవి, సునీత, తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి



ముంపు ప్రాంతాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: ఎడతెరిపి లేకుండా అకాలంగా కురిసిన భారీ వర్షం కారణంగా ముంపు ప్రాంతాల్లో సమస్యలను స్వయంగా తెలుసుకునేందుకు సోమవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌తో పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... అకాల వర్షాల కారణంగా ముంపుకు గురైన ప్రాంతాలను పరిశీలించామన్నారు. వర్షాలతో రోడ్లపై పేరుకుపోయిన మట్టిని తొలగించాలని పారిశుధ్య సిబ్బందిని ఆదేశించారు. ఆల్విన్ కాలనీ ఫేజ్2లో ఖాళీ స్థలాన్ని పార్కు కోసం వినియోగించుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. విష జ్వరాలు బారిన పడకుండా ప్రజలు ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మాన్‌సూన్, ఎమర్జెన్సీ టీమ్‌లు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. నాలాలో పేరుకుపోయిన మట్టి, చెత్తాచెదారాన్ని తొలగించాలని ఆదేశించారు. నాలాల చుట్టూ ఫెన్సింగ్ వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆల్విన్‌కాలనీ డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, నాయకులు రాజేష్‌చంద్ర, కాశీనాథ్‌యాదవ్, శివరాజ్‌గౌడ్, కృష్ణారావు, వెంకటేష్‌గౌడ్, కట్టా శ్రీనివాసరావు, షౌకత్ అలీ మున్నా, పోశెట్టిగౌడ్, సంతోష్, బిరాదర్, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

'పోలీసులు రాకపోయి ఉంటే నన్ను చంపేవారు'

సాయినగర్ సంఘం కార్యదర్శి శ్రీనివాస్

కేపీహెచ్‌బీకాలనీ: కూకట్‌పల్లి హౌసింగ్‌బోర్డుకాలనీ డివిజన్ పరిధిలోని సాయినగర్‌లో సంక్షేమం సంఘం కార్యదర్శి సోమెపల్లి శ్రీనివాస్ తనపై దాడిచేశారంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం కాలనీలో కొందరు వ్యక్తులు అకారణంగా తనపై దాడిచేసి చంపేందుకు యత్నించారని.. తన బట్టలు విప్పి లోదుస్తులపై కాలనీలోని ఆలయ ప్రాంగణం వరకూ ఈడ్చుకువెళ్లారని కేపీహెచ్‌బీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమయానికి పోలీసులకు రాకపోయి ఉంటే తనను చంపేవారంటూ ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కొంతకాలంగా ఇక్కడి కాలనీలోని భూములు వివాదాల్లో చిక్కుకున్నాయి. ఒక వైపు ప్రభుత్వంతో భూ వివాదాలు చక్కదిద్దుకునే పనిలో ఉన్న కాలనీవాసులు మరోవైపు మిగతా ఖాళీ స్థలాల్లోనూ ఇళ్లను నిర్మించేందుకు పనులను మొదలుపెట్టారు. అయితే నిర్మాణ పనులను అడ్డుకునేందుకు సంక్షేమ సంఘం కార్యదర్శి అధికారులకు ఫిర్యాదులు చేస్తూ పనులను అడ్డుకునేందుకు యత్నిస్తున్నాడనే విషయమై వివాదం నెలకొంది. ఈ నేపథ్యంలోనే కార్యదర్శి సోమేపల్లి శ్రీనివాస్‌పై అదే కాలనీకి చెందిన పలువురితో పాటు సర్దార్‌పటేల్ నగర్‌కు చెందిన పలువురు భవన నిర్మాణదారులు దాడులకు పాల్పడినట్లు శ్రీనివాస్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పేపర్ లీక్ వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలి

శేరిలింగంపల్లి బీజేపీ సీనియర్ నేత గజ్జల యోగానంద్



టీఎస్‌పీఎస్‌సీ పరీక్ష పేపర్ లీక్‌పై నిరసన దీక్షలో పాల్గొన్న గజ్జల యోగానంద్, బీజేపీ నాయకులు

ఆల్విన్‌కాలనీ: రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ పిలుపు మేరకు శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని వివేకానందనగర్ అల్లూరి సీతారామరాజు విగ్రహం ఎదుట సోమవారం టీఎస్‌పీఎస్‌సీ పరీక్ష పేపర్ లీక్ వ్యవహారంపై నిరసనగా గజ్జల యోగానంద్ దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం 20 లక్షల నిరుద్యోగుల భవిష్యత్‌తో చెలగాటం ఆడుతోందన్నారు. పరీక్షకు సిద్ధమై కష్టపడిన విద్యార్థులకు సీఎం కేసీఆర్ ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. ప్రశ్నాపత్రాలు లీక్ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేయటం తప్పుడు చర్య అని... ఈ విషయంపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ చేపడితేనే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని స్పష్టం చేశారు. వెంటనే సమగ్ర విచారణ జరిపించి దోషులను శిక్షించాల్సిన అవసరం ప్రభుత్వానికి ఉందన్నారు. కేసీఆర్ తన ఇంట్లో ఐదు ఉద్యోగాలు ఇచ్చి తెలంగాణ నిరుద్యోగులకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ విషయంపై యువతకు తగిన న్యాయం జరిగే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని పేర్కొన్నారు.

పరీక్ష పేపర్ లీక్ నిందితులను శిక్షించాలి

కూకట్‌పల్లి: టీఎస్‌పీఎస్‌సీ ప్రశ్నాపత్రం లీక్ సంఘటనపై నిరసన తెలపాలని తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం కూకట్‌పల్లి అసెంబ్లీ బీజేపీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు ఆధ్వర్యంలో కూకట్‌పల్లి బీజేపీ కార్యాలయం వద్ద దీక్షను చేపట్టారు. తెలంగాణ ప్రభుత్వం వేసిన సిట్‌తో కాకుండా హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని ఆయన అన్నారు. ప్రశ్నాపత్రం లేకేజీ ఘటనపై నైతిక బాధ్యత వహించి కేటీఆర్ తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

'మెడికవర్'లో ఇంటర్నేషనల్ ఓరల్ హెల్త్ డే

మాదాపూర్: చిన్న పిల్లలు నోటిని ఆరోగ్యంగా, శుభ్రంగా ఉంచుకుంటే చాలా వరకు రోగాలు దూరమవుతాయని దంతవైద్య నిపుణులు డాక్టర్ శరత్‌బాబు తెలిపారు. మాదాపూర్‌లోని మెడికవర్ ఆసుపత్రిలో చిన్నపిల్లలలో ఆరోగ్య సమస్యలపై అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ...శారీరక ఆరోగ్యానికి నోరు పరిశుభ్రంగా ఉండడం ఎంతో అవసరమన్నారు. పెద్దవాళ్ల చిగుళ్లవ్యాధికి హార్ట్‌అటాక్, డయాబెటిస్ లాంటి వ్యాధులకు సంబంధం ఉందని పరిశోధకులు వెల్లడిస్తున్నారన్నారు.

'మనూ'లో ఆకట్టుకున్న కార్యక్రమాలు

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని డ్రామా క్లబ్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ విమెన్ ఎడ్యుకేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. క్యాంపస్‌లోని యాంఫీథియేటర్‌లో ఇగ్నైటెడ్ మైండ్స్- ఓపెన్ మైక్‌'పేరిట ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఇది క్యాంపస్‌లో నిర్వహించిన ఐదో ఓపెన్ మైక్ ప్రోగ్రాం. దీంట్లో మొత్తం 12 మంది విద్యార్థులు పాల్గొని కథలు, కవిత్వం, గజల్, మైమ్, మోనోయాక్ట్, యూనివర్సిటీ డ్రామా క్లబ్ ద్వారా ప్రత్యేక ప్రదర్శనతో సహా అనేక రకాల ప్రతిభను ప్రదర్శించారు.

టీవీఎస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు

కంటోన్మెంట్: రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్ట పరమైన రక్షణలు కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలంగాణ వికాస సమితి (టీవీఎస్) మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం జరిగిన తెలంగాణ వికాస సమితి జిల్లా కార్యకర్తల సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. బోయిన్‌పల్లికి చెందిన వెంకటేశ్వర్లు అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగ పరమైన హక్కులు పౌరులందరూ వినియోగించుకునేలా తన వంతు ప్రయత్నాలు చేస్తానన్నారు.

డివిజన్ అభివృద్ధికి అధిక ప్రాధాన్యం



సిండికేట్ బ్యాంక్‌కాలనీలో నాలా పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నర్సింహయాదవ్

ఓల్డ్‌బోయిన్‌పల్లి: సిండికేట్ బ్యాంక్‌కాలనీలో నిర్మిస్తున్న నాలా పనులను సోమవారం కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ పరిశీలించారు. రూ.1.4కోట్లతో నిర్మిస్తున్న ఈనాలా పనులు పక్షం రోజుల క్రితం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జరుగుతున్న పనుల తీరు తెన్నులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. నాలా పనులు పూర్తి చేసి త్వరితగతిన ప్రజలకు అందుబాటులోకి తెవాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అభివృద్ధి పనులలో పారదర్శకత ఉండాలన్నారు. సిండికేట్ బ్యాంక్ కాలనీ నుంచి మల్లికార్జుననగర్ రోడ్డు నం.3లో ఉన్న నాలాకు అనుసంధానం చేయడంతో వర్షాకాలం వస్తున్న ఇబ్బందులు తొలగిపోతాయని అన్నారు. డివిజన్‌లో అభివృద్ధికి అధిక ప్రాధాన్యతను ఇస్తున్నామని... ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు రివ్యూ మీటింగ్‌లు పెట్టి పరిష్కారిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఈ అరవింద్, నాయకులు కర్రె జంగయ్య, బుర్రి యాదగిరి, హరినాథ్ స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణతో ఓల్డ్ బోయిన్‌పల్లికి మహర్దశ

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- ఎట్టకేలకు రోడ్డు విస్తరణకు మార్గం సుగమం



రోడ్డు విస్తారణలో ఇళ్లను కోల్పోతున్న బాధితులకు టీడీఆర్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే

ఓల్డ్ బోయిన్‌పల్లి: ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ ప్రధాన రహదారి ఎన్‌హెచ్ 44కు, సికింద్రాబాద్, రాజీవ్ రహదారితో పాటు ముంబాయి హైవేకు అనుసంధానంగా ఉండటంతో విస్తరణ పనులు చేపట్టామని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. రోడ్డు విస్తరణలో ఇళ్లను కోల్పోతున్న బాధితులకు సోమవారం ఆయన కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్‌తో కలిసి నష్టపరిహారం కింద (టీడీఆర్) చెక్కులను పంపిణీ చేశారు. పనులు పూర్తయితే ట్రాఫిక్ సమస్యకు చెక్ పడటంతో పాటు, స్థానిక వ్యాపారులకు ఇబ్బందులు లేకుండా ఉంటుందన్నారు. ఇళ్లను కోల్పోతున్న వారికి తక్షణమే నష్టపరిహారం అందజేస్తున్నామని పేర్కొన్నారు. రోడ్డు విస్తరణకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్, డిప్యూటీ కమిషనర్ రవీందర్, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ ఇర్షాద్, సూపర్‌వైజర్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు నరేందర్‌గౌడ్, కర్రె జంగయ్య, ఇర్ఫాన్, మేకల హరినాథ్, బుర్రి యాదగిరి, మేక ఉదయ్, పోచయ్య, సలీం, మల్లేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

బాలానగర్: శ్రీశ్రీనగర్ అసోసియేషన్ ఎన్నికల్లో గెలుపొందిన అధ్యక్ష, కార్యదర్శులు మల్లికార్జునాచారి, నాగభూషణం సోమవారం బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. బస్తీలో ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని కార్పొరేటర్ వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఖాళీ స్థలాన్ని పార్కుగా తీర్చిదిద్దాలి

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



మలేషియన్ టౌన్‌షిప్ వెనుక గ్రౌండ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ డివిజన్ మలేషియన్ టౌన్‌షిప్ వెనుక గ్రౌండ్‌ను కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సోమవారం కార్పొరేటర్లు మందడి శ్రీనివాసరావు, పగుడాల శిరీష బాబురావులతో కలసి పరిశీలించారు. గ్రౌండ్ చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మాణం పూర్తి చేసి పక్కనే ఉన్న ఖాళీ స్థలాన్ని పార్కుగా తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు. అనంతరం జేఎన్‌ఎన్‌యూఆర్ఎం వికలాంగులకాలనీని పరిశీలించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో ఉన్న ఖాళీ స్థలాన్ని పరిశీలించి కమ్యూనిటీహాల్ నిర్మించాలని సూచించారు. లీకేజీ అవుతున్న ఇళ్లకు మరమ్మతు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ అధికారులు ఈఈ సత్యనారాయణ, డీఈ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక నిర్మాణ పనుల పరిశీలన

అల్లాపూర్‌లో నిర్మిస్తున్న హిందూ శ్మశానవాటిక పనులను కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సోమవారం స్థానిక కార్పొరేటర్ సబిహా బేగంతో కలిసి పరిశీలించారు. పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అనంతరం ముళ్లకత్వ చెరువును పరిశీలించి చెరువు సుందరీకరణ పనులకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు మహమ్మద్ గౌసుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

క్యాంపు కార్యాలయంలో...

కూకట్‌పల్లి నియోజకవర్గంలోని పలు డివిజన్లకు సంబంధించి షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్లు సబిహా బేగం, పగుడాల శిరీష, మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్‌లతో లబ్ధిదారులకు సోమవారం అందజేశారు. మొత్తం 93 మందికి పంపిణీ చేశామని ఇప్పటికే కూకట్‌పల్లి నియోజకవర్గంలో దాదాపు 15 వేల మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేసినట్లు ఆయన వివరించారు. సంక్షేమ ఫలాలు నిరుపేదలకందే విషయంలో ఎక్కడా రాజీ పడకుండా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. నిరుపేదలకు ఉపయోగపడే పథకాలను ప్రవేశపెట్టడంలో తెలంగాణ రాష్ట్రం ముందంజలో ఉందన్నారు.